20న జాబ్ మేళా

కాకినాడ: ఈనెల 20న స్థానిక జగన్నాధపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి అనంతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, ఆయా సంస్థలచే 500 ఉద్యోగాలకు జాబ్ డ్రైవ్ జరుగుతుందన్నారు. ఈ డ్రైవ్‌లో ఏదైనా డిగ్రీ, పీజీ, ఐటిఐ, 10వ తరగతి, పాలిటెక్నిక్ చదివిన స్త్రీలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని జెకెసి కో ఆర్డినేటర్ డాక్టర్ పి.సంజోత తెలిపారు. ఈ డ్రైవ్‌కు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, 2 ఫోటోలు తీసుకురావాలన్నారు.

నిబంధనలా..మాకెందుకు..?

-వ్యాపారాల్లో యథేచ్ఛగా డొమెస్టిక్ సిలెండర్లు
-కమర్షియల్ గ్యాస్ వినియోగం అరకొరే
-తనిఖీలు చేయని పౌరసరఫరాల శాఖ.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. నిబంధనల ప్రకారం వాటిని వ్యాపార సంస్థలలో వినియోగించడానికి వీలు లేదు. అయితే అధికారులు నిర్లక్ష్యం వలన వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా వాటిని వినియోగిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 16.77లక్షల మంది గ్యాస్ వినియోగదారులున్నారు. వీరిలో గృహ అవసర వినియోగదారులు దాదాపు 15.10 లక్షల మంది ఉన్నారు. నెలకు సరాసరి 7.5 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుంది. వాణిజ్య గ్యాస్ కనెక్షన్లు సుమారు లక్ష వరకు ఉన్నాయి. వ్యాపార పనులకు వినియోగించే వాణిజ్య గ్యాస్ కనెక్షన్ల సంఖ్యకు అనుగుణంగా నిబంధనల మేరకు వినియోగం ఉండడం లేదు. 19 కేజీలు, 5 కేజీల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

కాకినాడలో ఒక వ్యాపార కేంద్రంలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగం

విచ్చలవిడిగా వినియోగం

టీ, కాఫీ, టిఫిన్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, భజ్జీ కొట్లు, కళ్యాణ మండపాలు ఇలా అనేక వ్యాపార సంస్థలు వద్ద ఇబ్బడిముబ్బడిగా డొమెస్టిక్ సిలెండర్లనే వాడుతున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట, పిఠాపురం, తుని, అన్నవరం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం ఇలా పలు చోట్ల ఎక్కువగా వందల్లో వ్యాపారులు గ్యాస్ సిలెండర్లను ఇష్టారీతిన తమ వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 60 నుంచి 70 వేల వరకూ గ్యాస్ ఉపయోగించే దుకాణాలు ఉంటాయి. ఈ సంఖ్యకు అనుగుణంగా వాణిజ్య సిలిండర్లను వాడాల్సి ఉండగా కేవలం వందల్లోనే వీటిని వినియోగిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గృహ అవసరాలకు వాడే సిలెండర్లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఎక్కడ చూసినా వీటి వినియోగమే ఎక్కువగా కనిపిస్తుంది. బహిరంగంగానే డొమెస్టిక్ బండలను వాడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలను పక్కనపెట్టి గృహ అవసర సిలిండర్లను వాణిజ్య దుకాణాలకు సైతం వేస్తుండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాణిజ్య బండలను వినియోగించాలని నిబంధనలు ఉన్నా పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వీటిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే నామమాత్రపు తనిఖీలతోనే సరిపెడుతూ మామూళ్ల మత్తులో ఉన్నారన్న ఆరోపణలు సంబంధిత శాఖ అధికారులపై వినిపిస్తున్నాయి. సిలిండర్లను సరఫరా చేసే కొంతమంది సిబ్బంది వంట గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్నారు. ఇదంతా ఏజెన్సీల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ రూ.2వేలకు పైనే ఉంది. గృహ అవసరాల సిలెండర్ రూ.870 ఉండడంతో కొందరు మామూళ్లకు అలవాటు పడి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ధరలో సగానికి పైగా తేడా ఉండడంతో వ్యాపారులు డొమెస్టిక్ బండలపైనే మక్కువ చూపుతున్నారు. మరోవైపు అటు వినియోగదారులపై సైతం అధిక ధరలకు ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు వెళుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో పక్కదారి పడుతున్న గృహ వినియోగ సిలిండర్ల విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వాడితే చట్టరీత్యా నేరం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ నెలలో ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా డొమెస్టిక్ గ్యాస్ వాడకం జరిగితే మాకు ఫిర్యాదులు చేయాలి. అటువంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

-ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, డిఎస్ఒ

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం కలెక్టర్ షాన్ మోహన్ సగిలి కాకినాడ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకినాడ సాలిపేట వద్ద ఉన్న పైడా సత్యరాజు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీనగర్‌లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెంట్లతో మాట్లాడి విద్యార్థుల హాజరు వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షకు 27,592 మంది విద్యార్థుల కోసం 142 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం జరిగిన పరీక్షలకు 27,368 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. 224 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. తొలి రోజు తెలుగు పేపర్ పరీక్ష అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ప్రశాంతంగా జరిగాయని, విద్యార్థులు అందరు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం విద్యార్థులు తమ వెంట మొబైల్ ఫోన్లు, ఎటువంటి పేపర్లు తీసుకువెళ్లడానికి వీలు లేదన్నారు. ఎండ వేడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువగా మంచినీరు తీసుకోవాలన్నారు. తగు ఆహార జాగ్రత్తలు పాటిస్తూ మంచిగా అన్ని పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు.

అవసరమైన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ఓటర్లకు సౌలభ్యంగా ఉండేలా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు జరుగుతుందని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛత మెరుగుపరచడానికి బూత్ లెవెల్ ఆఫీసర్లను, తగినంతమంది ఉన్నత స్థాయి అధికారులను బిఎల్ఒ లు గా నియమించవలసి ఉందన్నారు. బిఎల్ఒల శిక్షణా కార్యక్రమాన్ని ఏప్రిల్ 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా శిక్షణా షెడ్యూలు రూపొందించి సిఇఒలకు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా సమీక్ష చేపడుతున్నామన్నారు. ఒక పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు మించకుండా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు చెప్పారు. 2 కిలోమీటర్ల లోపల పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు నివాసం నుంచి పోలింగ్ కేంద్రం దూరంగా ఉండకుండా సమీప కేంద్రాలకు ఓటర్లను మార్చేందుకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ ఎఒ కాంతారావు, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, సిపిఎం జిల్లా నాయకులు నీలపాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో ఫాగింగ్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో దోమల నివారణకు ఏకకాలంలో ఫాగింగ్ చేయాలని దిశ జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి వీరవెంకటవినోద్ పిజిఆర్ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని నెలరోజుల కితం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కావున లెట్రిన్ గొట్టాలకు నెట్‌లు కట్టడం, కాలువలో ఆయిల్ బాల్స్ వేయడం, చెరువుల్లో గంబుషియా చేప పిల్లలను పెంచడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్రోజు దయ బానోజీరావు, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

సమావేశంలో మాట్లాడుతున్న శేష బాబ్జి

ఎన్నికల ముందు కార్మికులకు కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేష బాబ్జి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యాంలపు సూర్యారావు భవనంలో జరిగిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. అనేక విభాగాల కార్మికులకు వేతనాల పెంపుదల, సమస్యల పరిష్కారం చేస్తామని ఇచ్చిన హామీలపై కూటమి నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ ఆ శాఖలో పంచాయతీ కార్మికులకు ఆరు నెలల నుంచి ఏడాది కాలం జీతాల బకాయిలు ఉన్నాయన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీ రాణి, జిల్లా కార్యదర్శి చెక్కల రాజకుమార్, డి.క్రాంతికుమార్, పలివెల వీరబాబు, చంద్రావతి, రాజా, ఈశ్వరరావు, షేక్ పద్మ, నెక్కల శ్రీను, మేడిశెట్టి వెంకటరమణ, పద్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్‌కు వస్తున్న వినతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, కెఎస్ఇజడ్ ఎస్‌డిసి కెవి. రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావులతో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. ఈ వినతులకు అధిక ప్రాధాన్యత నిచ్చి పరిష్కరానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రత్యేక స్టాల్ ఏర్పాటు...

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, పండ్లు ఈ స్టాల్‌లో ఉంచారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మించాలి

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలో డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బృందం ఎంపిడిఒ అనుపమను కోరింది. సోమవారం కరప గ్రామంలో నిర్వహించిన సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో ప్రజలు పలు సమస్యలను బృందం దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. అనుపమకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, చీకట్ల వెంకటలక్ష్మి గ్రామస్తులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని నక్క వారి ఎస్‌సి పేటలో సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, 15 ఏళ్ల క్రితం నిర్మించిన సిసి రోడ్డుకు చిన్న డ్రెయినేజీ నిర్మించారని తెలిపారు. మురుగునీటి ప్రవాహం ముందుకు సాగక దోమలు పెరిగిపోతున్నాయని అన్నారు. దోమల వల్ల ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లపు వీధి గుర్రప్ప చెరువు ప్రక్క వీధికు రోడ్లు నిర్మించిన డ్రెయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గంటాలమ్మ గుడి సమీపంలోని శిథిలమైన బావి చుట్టూ ఇళ్లలోని వాడకపు నీరు రోడ్ల పైన పారుతుందని తెలిపారు. బావి వద్దకు చేరిన నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ స్పందిస్తూ ఆయా ప్రాంతాల్లోని సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బల్లి లక్ష్మి, బల్లి సూరిబాబు, పి.వీరవేణి, పి.దుర్గ, కనికెళ్ళ మహాలక్ష్మి, నక్క పాప, నక్క సత్యవేణి, బచ్చల కామేశ్వరి, మందనక్క గోవిందరాజు, మర్రి ప్రసాద్, వీరమణి పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు రాజశేఖర్

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నవీన్

మండలంలోని సీతానగరంలో దేవి ఫిషరీస్ సహకారంతో పంచాయతీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ సీతానగరం గ్రామంలో ప్రజల దాహార్తిను తీర్చడానికి దేవి ఫిషరీస్ యాజమాన్యం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ముమ్ముందు ఇదే రీతిలో సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవి ఫిషరీస్ ఆకాష్, టిడిపి నాయకులు భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, ఈర్పిన శ్రీను, కుదప మురళీకృష్ణ పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని పరిశీలించిన సిఎంఒ

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థులతో మాట్లాడుతున్న సిఎంఒ చామంతి

స్థానిక భవిత కేంద్రాన్ని విద్యాశాఖ సెక్టోరియాల్ ఆఫీసర్ సిఎంఒ చామంతి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఎంఇఒ-2 పిపుల్లయ్యతో కలిసి ఆయన కేంద్రాన్ని సందర్శించి కేంద్రానికి హాజరయ్యే విద్యార్థులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ టీచర్లు అనిత, పద్మావతి ఫిజియోథెరపిస్ట్ అపర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎనలేనివని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో పారిశుధ్య కార్మికులకు వరలక్ష్మి సౌజన్యంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కుకు వచ్చే వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం పార్కును పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపిడిఒ హిమమహేశ్వరి

మండల పరిధిలో ఇబిసిలకు చెందిన యువతకు రాయితీతో కూడిన ఉపాధి రుణాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 50శాతం రాయితీతో ఇబిసి పరిధిలోని ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు సంబంధించి రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు యూనిట్ విలువను బట్టి రాయితీతో కూడిన రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జనరిక్ మందుల షాపు, సూక్ష్మ వ్యాపారాలు వంటి ఉపాధికి స్థానికంగా ఉన్న సచివాలయాల్లో గాని, మీసేవ కేంద్రాల్లో గాని దరఖాస్తు చేసుకోవచ్చుని అన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వారి కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, రైస్ కార్డ్, ఫోన్ నెంబర్ వంటి వివరాలతో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మద్యం షాపు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మద్యం షాపును తొలగించాలని కోరుతూ సోమవారం పాడా కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పీడీ చైత్రవర్షిణికి చేబ్రోలుకు చెందిన పలువురు వినతిపత్రం అందించారు. చేబ్రోలు నుంచి మల్లవరం వెళ్లే రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మందుబాబులు మద్యం సేవించి మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రాంతంలో మద్యం షాపు వద్దని సంబంధిత అధికారులకు దరఖాస్తులు ఇచ్చామని, కానీ కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేశారని, దీనికి నిరసనగా గ్రామంలో ధర్నా కూడా చేపట్టామని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి మద్యం షాపు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తెల నాగసత్య, అయినవిల్లి నూకమ్మ, వేమగిరి అప్పయ్యమ్మ, దొడ్డపాటి చిన్ని, ఆరుగుల చిట్టితల్లి, రేవతి, అడ్డలు సరస్వతి, పాలేటి మార్త తదితరులు పాల్గొన్నారు.

పాడా పీడీ చైత్రవర్షిణికి వివరిస్తున్న మహిళలు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపిపి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. సోమవారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రెయినేజ్, జడ్‌పి హైస్కూల్లో సైకిల్ షెడ్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం తిరుమాలి గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్తు అభివృద్ధి నిధులతో ప్రతి గ్రామానికి కనీస వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి చిక్కాల రాజేశ్వరి, టిడిపి నాయకులు ఎస్‌జివి.సుబ్బరాజు, చిక్కాల లక్ష్మణరావు, జనసేన జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్, మండల కార్యదర్శి పలివెల వెంకటేష్, ఎంపిడిఒ కెవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్టూన్‌'నిజం'

12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్

ఉద్యోగులకు పిఆర్‌సి కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ పి.త్రినాధరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి అత్తిలి వీరవెంకటసత్యనారాయణ మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన డిఆర్ బకాయిలు వెంటనే ఇప్పించాలని కోరారు. ఆ సొమ్మును తీసుకోకుండానే చాలామంది సభ్యులు మరణించారని అన్నారు. గత పిఆర్‌సిలో తగ్గించిన ఎడిషనల్ క్వాంటం ఆఫ్ ది పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 ఏళ్లకు 10 శాతం, 75 ఏళ్లకు 15 శాతంను పునరుద్ధరణ చేసి ఇప్పించాలని కోరారు. ఇహెచ్ఎస్ కార్డుపై వైద్యం చేయలేమని, మెడికల్ రీయంబర్‌మెంట్‌పై వైద్యం చేయించుకోమని హాస్పిటల్ వర్గాలు అంటున్నాయని అన్నారు. ఆర్థిక వెసులుబాటు లేక చాలామంది వైద్యం చేయించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇహెచ్ఎస్ కార్డుపై క్యాష్ లెస్ వైద్యం పూర్తిస్థాయిలో అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించి మా జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కెవివి.రామకృష్ణయ్య, ట్రెజరర్ దడాల వెంకన్న, కడలి ప్రకాశరావు, ఎలిపే నాగేశ్వరరావు, పుప్పాల రామకృష్ణ, దంగేటి మంగాదేవి, వనిమిశెట్టి గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

వేలం పాటను నిర్వహిస్తున్న నిర్వాహకులు

రూ.18.46 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలో 2025-26 ఏడాదికి మార్కెట్ ఆశీలు, మేకలు, పశువుల కభేలాలకు నిర్వహించిన వేలంలో రూ.18.46 లక్షల ఆదాయం వచ్చిందని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తెలిపారు. సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో మార్కెట్ ఆశీలు వసూలుకు రూ.15.90 లక్షల హెచ్చుపాటను పి.వేమవరం గ్రామానికి చెందిన కర్రి లోవమ్మ దక్కించుకున్నారు. మేకల కభేల నిర్వహణకు రూ.53 వేలు హెచ్చు పాటతో పట్టణానికి చెందిన రొట్టా శ్రీనివాస్, పశువుల కభేల నిర్వహణకు రూ.2.03 లక్షలకు పట్టణానికి చెందిన మొహమ్మద్ షఫీయుల్లా దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని సిరిపురం, చిన్నింపేట పరిధిలో గల గృహ, వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం మంగళవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ బి వీరభద్రరావు తెలిపారు. కావున రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చోరీకి గురైన ధాన్యం స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా బుల్లి వెంకటేశులు గోకవరం గ్రామం, రంప ఎర్రంపాలెం గ్రామాల మధ్యన పోలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వరికుప్పను నూర్చి ధాన్యాన్ని మూటలుగా కట్టి రోడ్డు పక్కన బరకళ్లో ఉంచారు. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ ధాన్యాన్ని దొంగిలించారు. దీంతో వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన సత్తినాటి వీరబాబును నిందితునిగా గుర్తించారు. విచారించగా నేరం అంగీకరించాడు. బెట్టింగులకు అలవాటు పడి అప్పులు కావడంతో ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఆటోపై గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్డు పక్కన ఉంచిన సుమారు 70 క్వింటాలు వరి ధాన్యం దొంగిలించాడని గుర్తించామన్నారు. ప్రస్తుతం వీరబాబు నుంచి ఒక ఆటో, 14 క్వింటాళ్ల ధాన్యాని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ధాన్యాన్ని రైతు వెంకటేశులుకి అప్పగించామని తెలిపారు.

బంధన్ బ్యాంకులో ఘరానా మోసం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తమ బ్యాంకులో నుంచి గ్రూపులోన్ ఇప్పిస్తామని నమ్మబలికి బ్యాంకు సిబ్బంది లక్షలు కాజేసి పరారైన వైనం రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితరాలు ఏడిద సూర్యకుమారి, రగత చిన్న అమ్ములు తెలిపిన వివరాల ప్రకారం...వలసపాకల గ్రామంలో ఉన్న బంధన్ బ్యాంక్‌లో పది లక్షలు లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఏడిద సూర్యకుమారి నుంచి రూ.1.45 లక్షలు, రగత చిన్న అమ్ములు దగ్గర నుంచి రూ.2.30 లక్షలను బంధన్ బ్యాంక్ రికవరీ మేనేజర్ గణేష్, ఉదయ భాస్కర్‌లు తీసుకున్నారన్నారు. ఆ సొమ్మును వేరే అకౌంట్ లోకి మళ్ళించారన్నారు. ఎంతకీ తమకు లోన్ మంజూరు కాకపోవడంతో బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబుకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాము అప్పులు చేసి ఆ డబ్బులు సమకూర్చి వారికి ఇచ్చామని, ఇప్పుడు ఆ డబ్బులు పోయి లోన్ కూడా రాకపోవడంతో తమ పరిస్థితి ఏంటని బాధితులు గగ్గోలు పెట్టారు. దీనిపై బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబు మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా దాదాపు 70 మందిని బ్యాంకు రికవరీ బృందం మోసం చేసి రూ.6 లక్షల వసూలు చేసినట్లు గుర్తించామని తెలిపారు. రికవరీ స్టాఫ్ గణేష్ పరారీలో ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పంట కాల్వలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువలో సోమవారం గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. మృతుని వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉంటుందని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. విఆర్ఒ డి.శైలజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గవర్నర్‌ను సత్కరిస్తున్న జెఎన్‌టియుకె విసి ప్రసాద్

గవర్నర్ నజీర్‌ను కలిసిన జెఎన్‌టియుకె విసి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె విసి సిఎస్ఆర్‌కె.ప్రసాద్ సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విజయవాడ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణను గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రంలో జెఎన్‌టియుకెకు ప్రత్యేక గుర్తింపు ఉందని, సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని గవర్నర్ సూచించినట్లు విసి తెలిపారు. యూనివర్శిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కూడా ఆదేశించారని తెలిపారు.

మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న యనమల దివ్య

జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - తుని

కోటనందూరు మండలం పాత కొట్టాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్ఎ యనమల దివ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటనను విడుదల చేశారు. పాత కొట్టాం, కొత్త కొట్టాం, లక్ష్మీదేవి పేట, అల్లిపూడి, కెఇ.చిన్నయ్యపాలెం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, అలాగే అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన గునుపూడి, పికె.గూడెం, చిన్నగొడుగుండుపేట, పెద్ద గొలుగొండపేట, వెదురుపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు 450 నుంచి 500 వరకు ఉన్నారని, వారికోసం పాత కొట్టాంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎస్టిమేట్స్, ప్రతిపాదనలతో కూడిన లేఖను మంత్రికి అందజేసినట్లు తెలిపారు.

మానవ విలువలే మంచి సమాజానికి మార్గం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వర్ధంతి సభలో మాట్లాడుతున్న సత్యస్కాన్ అధినేత వెంకటరమణ

మానవ విలువలే మంచి సమాజానికి మార్గం చూపుతాయని ప్రముఖ రేడియాలజిస్ట్, సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాద వెంకటరమణ అన్నారు. కార్మికోద్యమ నాయకులు, ఎన్జిఒ సంఘం పూర్వ జిల్లా కార్యదర్శి వాసంశెట్టి సూర్యారావు 6వ వర్ధంతి సభ ఇంద్రపాలెం కెనెన్ రోడ్‌లో జరిగింది. ఈ సభకు సిపిఎం నాయకులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నేడు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి అవుతుందని, వాటి ఫలాలు క్రింది స్థాయి వరకు అందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనికి పాలకులు, స్వచ్ఛంద ప్రజలు, ప్రజా సంఘాలు, పౌర సంస్థలు దోహదపడాలన్నారు. మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలు, కల్పిత కథనాలు ముందుకు రావడం ఆందోళనకరమని అన్నారు. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సూర్యారావు ఆలోచనలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 'శరీర, అవయవ దానం ప్రాధాన్యత - సామాజిక బాధ్యత' అనే అంశంపై డాక్టర్ డివి రాజు మల్లి ఆర్గాన్ ఫౌండేషన్ ఫౌండర్, ఛైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడారు. జీవించి ఉండగానూ, జీవనాంతరం సమాజానికి ఉపయోగపడే అవకాశం ఒక మనిషికి మాత్రమే ఉందన్నారు. మనిషి తన అవయవాలు దానం ద్వారా మరో ఎనిమిది మందికి ప్రాణదానం చేసిన వాళ్ళు అవుతారని అన్నారు. సూర్యారావు కళ్లు, తన శరీరాన్ని దానం చేసి కొంతమంది వైద్యులు తయారవడంలో దోహదపడ్డారని కొనియాడారు. 'మంచి ఆహారపు అలవాట్లు' అనే అంశంపై ఎ.సురేంద్రబాబు మాట్లాడారు. ప్రతి ఒక్కరు తగిన నిద్రకు తగిన సమయం కేటాయించి వేకువజామునే లేచి తప్పనిసరిగా అరగంట వ్యాయామం చేయాలన్నారు. తరచూ తగిన మంచినీళ్ళ తాగాలని, కోడి గుడ్డు, పురుగు మందులు హెచ్చుగా వినియోగించని కూరగాయలు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలని వివరించారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్‌రావు మాట్లాడుతూ తమ కార్యకర్తలు ప్రజల మౌలికమైన జీవిత అవసరాలు మార్పు కోసం కార్యకలాపాలు నిర్వహిస్తూనే ప్రజలలో సానుకూల దృక్పథం పెంపొందించేలా, మంచి ఆరోగ్యకర జీవన విధానం కోసం కృషి చేస్తామని చెప్పారు. ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ, దేశభక్తి గేయాలు ఆలపించారు. పోలిశెట్టి అమ్మాజీ స్మారక సమితి ప్రచురించిన 'నవజీవన వైతాళికులు', కెవిఎస్ స్మారక వ్యాస సంకలనం 'డియర్ కామ్రేడ్' పుస్తకాలను వక్తలకు, అతిథులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, జుత్తుగ శ్రీనివాసరావు, మండల కమిటీ కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజశేఖర్, వాసంశెట్టి చందర్రావు, సోనీ వివిఎస్‌ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్ కన్వీనర్ సిహెచ్.కిరణ్ కుమార్, సిహెచ్.అజయ్‌కుమార్, సిహెచ్.విజయకుమార్, చింతపల్లి రమణ, వర్మ, చక్రవర్తి, నగేష్, ప్రసాదరావు, సిహెచ్‌వి.రమణ, వివి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ నాతి బుజ్జి

ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణ బయట చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి సోమవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని వేసవికాలంలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు సహకరించాలని అన్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, నేషనల్ హైవేపై వెళ్లే ప్రయాణికులకు దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జూన్ మొదటి వారం వరకూ ఈ చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ కె.చంద్రరావు, ఎంఇఒ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దాత రాజేశ్వరరావు

బస్ షెల్టర్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పాత రిజిస్టర్ కార్యాలయం వద్ద, సిబిఎం సెంటర్ వద్ద రూ.2.50 లక్షలతో నిర్మించనున్న బస్సు షెల్టర్ల పనులకు శంకుస్థాపన సోమవారం జరిగింది. దాత వెలగ రాజేశ్వరరావు సహకారంతో షెల్టర్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్, దాత రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకకాలంలో ఫాగింగ్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో దోమల నివారణకు ఏకకాలంలో ఫాగింగ్ చేయాలని దిశ జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి వీరవెంకటవినోద్ పిజిఆర్ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని నెలరోజుల కితం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కావున లెట్రిన్ గొట్టాలకు నెట్‌లు కట్టడం, కాలువలో ఆయిల్ బాల్స్ వేయడం, చెరువుల్లో గంబుషియా చేప పిల్లలను పెంచడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్రోజు దయ బానోజీరావు, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్మశానంలో నీళ్ల ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు సమీపంలో ఉన్న స్మశానంలో తాళ్లూరు వారి సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీళ్ల ట్యాంకును సోమవారం సత్రం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షతో 3 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రస్ట్ సభ్యు లు తాళ్లూరు ప్రసాద్, సత్తిరాజు, శ్రీనివాసు, కాంబాబు, రాజు, రవితేజ, కామేష్, ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, చిక్కాల సాయిరాం పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వివిధ కార్పొరేషన్ల ద్వారా 50 శాతం రాయితీపై రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబిసిలకు సామాజికవర్గాల యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు వయసు గల లబ్ధిదారులు ఈ నెల 23వ తేదీ లోపు గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిజిఆర్ఎస్‌లో 7 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యమ్రంలో 7 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను ఆర్‌డిఒ శ్రీరమణి స్వీకరించారు. భూ సమస్య పరిష్కారానికి సంబంధించి 4, విద్యుత్ సమస్య పరిష్కరించాలని 2, సాగునీటి సమస్యపై 1 ఫిర్యాదులు అందాయని ఆర్‌డిఒ తెలిపారు. అలాగే మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం 3 అర్జీలు అందాయని తహశీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు.

తప్పులు లేకుండా రీ సర్వే

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలో చేపట్టిన రీ సర్వే తప్పులు లేకుండా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ భావన అన్నారు. సోమవారం స్థానిక డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో 11 మండలాల రీ సర్వే డిటిలు, మండల, విలేజ్ సర్వేయర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రీ సర్వే చేసినప్పుడు జరిగిన తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పిజిఆర్ఎస్‌లో 44 అర్జీలు

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 44 అర్జీలు వచ్చాయని పాడా పీడీ చైత్రవర్షిణి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ విభాగానికి సంబంధించి 15, మున్సిపాలిటీ విభాగానికి సంబంధించి 15, ఎక్సైజ్ విభాగానికి సంబంధించి 1, ఆర్ అండ్ బి విభాగానికి సంబంధించి 2, ఇతర విభాగాలకు సంబంధించి 11, మొత్తం 44 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ముందస్తు సమాచారం ఇవ్వాలి

పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై ప్రజాసంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నాయకులు కుంచే చిన్న, సాఖ రామకృష్ణ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముందస్తుగా సమాచారం ఇవ్వడంలో అధికారులు విఫలం అయ్యారని అన్నారు. ప్రజలకు తెలిసేలా సమాచారం అందించి వారి అర్జీలను పరిష్కరించాలని కోరారు.

పాడా పీడీతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మెయిన్ రోడ్డులోని ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో సోమవారం అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ అన్నదానానికి ఇర్రిపాక గ్రామానికి చెందిన పంతం కృష్ణారావు కుమారులు సత్యనారాయణ, రాజాల ఆర్థిక సాయం చేశారు. ఈ అన్నదానం కార్యక్రమాన్ని టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ, నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న జ్యోతుల నవీన్

విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం లూథరన్ హైస్కూల్ 6వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పిండి పదార్థాల పరీక్ష, మాంసకృతుల, కొవ్వుల పరీక్షలు, ఏ ఏ వస్తువులు ఏ ఏ పదార్థాలతో తయారవుతాయి, కరిగేవి, కరగనివి, మునిగేవి, తేలివి, వడపోత వంటి ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మాజీ ఎంపిపి బుద్ధా వెంకట రమణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంతోష్ రూ.20 వేలు విలువ చేసే ఫ్యూజి ఫిల్మ్ కెమెరాను సైన్స్ సెంటర్‌కు బహుకరించినట్లు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రామశాస్త్రి దాత సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సంతపేట సెంటర్లో సోమవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ గోకవరపు సుభాష్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పేద ప్రజలకు వేసవి తాపాన్ని తీర్చడానికి ఇది ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కూర్మదాసు భారతి, వరదా జయశ్రీ , అద్దేపల్లి సత్తిరాజు, కూర్మదాసు అయ్యన్న, వరదా శేషు, తాతాజీ, పొన్నాడ రాజు, నున్నదత్తు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

యానాం వార్తలు

యానాంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లీదండ్రులు

ప్రశాంతంగా పది పరీక్షలు

ప్రజశక్తి - యానాం

10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. స్థానిక రీజన్సీ పబ్లిక్ స్కూల్లో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. సెంటర్ ఎలో 230 మంది విద్యార్థులు, సెంటర్ బిలో 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అలాగే పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మిల్క్ బాయిలర్స్‌కు త్వరలోనే జీతాల పెంపు...

ప్రజాశక్తి - యానాం

ఎంఎల్ఎ శ్రీనివాస అశోక్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్‌కు త్వరలో జీతాలను రూ.18 వేలకు ప్రభుత్వం పెంపుదల చేయనున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశంలో జీతాల పెంపు విషయంపై విద్యా శాఖా మంత్రి నమశ్శివాయంను అసెంబ్లీలో ప్రశ్నించగా జీతాల పెంచే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారని వివరించారు. ఇప్పటికే సంబంధిత ఫైలు ఎల్‌జి దగ్గర ఉందని, వారం రోజుల్లోనే జీతాల పెంపుకు సంబంధించి ఉత్తర్వులు జారీచేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రంగసామి కూడా జీతాల పెంపుపై హామీ ఇచ్చారని తెలిపారు. యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో యుపిఎస్‌సి ద్వారా వైద్యులను నియమించే విధంగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించడం వద్ద అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోగులకు సరైన వైద్యం అందడం లేదని ప్రశ్నించనట్టు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన యుపిఎస్‌సి ద్వారా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అసెంబ్లీలో కోరినట్టు తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జీవారి కోర్టులో

I.A. 1732/2024, ASSR. 7024/2024

Between:

ఆదిరెడ్డి నాగ వీర సత్యనారాయణ రామ్ కుమార్ ...పిటీషనరు

మరియు

యానాల శ్రీనివాస్ ...రెస్పాండెంటు

To, **యానాల శ్రీనివాస్,** తండ్రి - తాతారావు (లేటు) వయస్సు 32 సం॥ ప్రైవేట్ ఎంప్లాయ్, డో॥నెం. 5-184 కిల్లి వారి వీధి, నడకుదురు, కరప మండలం, కాకినాడ జిల్లా.

ప్రకటన:

పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం చివరి సారిగా **ది. 20-03-2025 సం॥ తేదీన పై కోర్టులో ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైన ఉన్న యెడల, శ్రీ కోర్టు వారికి తెలియజేయవలెను. లేని యెడల సదరు తీర్పు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

మర్ల నరసింహారావు, అడ్వకేట్
డో.నెం.1-9-7, శ్రీరామ్ నగర్, కాకినాడ - 533 003.
కాకినాడ
ది.17-3-2025 సెల్ : 9848277373

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S. No. 56/2015

Between :

దెయ్యాల రాంబాబు & అదర్స్ ...వాదులు

మరియు

దెయ్యాల అప్పారావు & అదర్స్ ..ప్రతివాదులు

(To ప్రతివాదులు): -

D.21 : బత్రాజు కరుణ కుమారి, W/o. గోవింద రాజులు, డో.నెం. 4-51, గొల్లపేట, ఇంద్రపాలెం గ్రామం, కాకినాడ రూరల్, కాకినాడ.

D.22 : చింతపల్లి సూర్యకళ రాజలక్ష్మి, W/o. వీరవెంకట నారాయణరెడ్డి, డో.నెం. 9-44, జయప్రకాశ్ నగర్, తూరంగి, కాకినాడ రూరల్, కాకినాడ. ...21,22 ప్రతివాదులు

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పై నెంబరు దావాలో 21 మరియు 22 ప్రతివాదులు అయిన మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా, మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-03-2025 తేది ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

అద్దేపల్లి మురళీధర్
వాదుల తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ
కాకినాడ.
ది.17-03-2025 సెల్: 9849170270

ప్రకటన

ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, రాజమహేంద్రవరం సెక్రటరీ గారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పెద్దాపురం వాస్తవ్యులు శ్రీ బొమ్మాడ వెంకటేష్ గారి భార్య శ్రీమతి బొమ్మాడ తులసి గారు సదరు బ్యాంక్‌లో ఋణము కొరకు దరఖాస్తు చేసుకున్నారు. వారు **ది. 11-11-2024, డాక్యుమెంట్ నెం. 11802/2024** గా షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారు వగైరాల వలన టి.ఎస్. నెం. 2-6-340 లో డో.నెం. 8-12-17/1 డాబా ఇల్లు కొనుగోలు చేసి సదరు ఆస్తిపై ఋణ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సదరు షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారి వారి భార్య షేక్ జరినా బేగం గారు ది. 30-10-2023 తేదీన మరణించిన తరువాత దఖలు పడగా వారు విక్రయించినారు. అయితే దస్తావేజులో షేక్ జరీనా బేగం అని Death Certificate లో షేక్ జరీనా అని యున్నది. కావున వారి పేరు విషయంలో ఆస్తి విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లు అయితే 10 రోజుల లోపు సదరు బ్యాంక్ వారికి వ్రాత పూర్వకంగా తెలుపవలెను. లేనిచో సదరు బ్యాంక్ వారు బొమ్మాడ తులసి గారి ఋణ దరఖాస్తు స్వీకరించబడునని తెలియజేయడమైనది.

పి.మృత్యుంజయరావు
అడ్వకేట్, డో.నెం. 11-6-7
పెద్దాపురం, సెల్: 9848113611

బహిరంగ ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామ డోరు నెం. 7-10రు కాపురస్తులు పోలోతు రామారావు గారి కుమారుడు పోలోతు సురేష్ అను నేను ప్రమాణముపై దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,

తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన శెటిల్‌మెంటు విడుదల దస్తావేజు ద.నెం. 139/2025 రుకు లింకు క్రయ దస్తావేజు నెం. 1032/2020 రు మిస్ అయినది. దాసరా నాగేశ్వరరావు వగైరాల వల్ల క్రియం పొందినటు వంటి క్రయ దస్తావేజు అయివున్నది. సదరు ద.నెం. 139/2025 రుకు లింకు దస్తావేజు అయివున్నది. సదరు పైన వివరించబడిన లింకు క్రయ దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగినది. అలాగే ది. 18-03-2025వ సం॥రం తేదీన ప్రజాశక్తి న్యూస్ పేపర్ నందు దస్తావేజు పడిపోయినవని ప్రకటన కూడా యిచ్చియున్నాను. గనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు అనియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియ వచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200 రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

ఎన్.తాతారెడ్డి, అడ్వకేట్/ నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
ది.17-3-2025 సెల్: 98866 960337

గ్రామపంచాయతీ కార్యాలయం, మలికిపురం

టెండరు ప్రకటన

రి.క.నెం.8/2025 తేది.10-03-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, మలికిపురం గ్రామపంచాయతీనకు ఈదిగువ నుదహరించిన సామాగ్రి సరఫరా చేయుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలునకు 20-03-2025 సం॥రం తేదీ గురువారం మధ్యాహ్నం గం॥ 3.00ల వరకు మాత్రమే సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి ఏవిధమైన టెండర్లు స్వీకరించబడవు. అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.30లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో సీల్డు టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయగోరువారు ఈదిగువ చూపిన విధముగా ధరావత్తు చెల్లించి క్రమమైన రసీదు పొంది టెండరునకు జతపరచవలెను. ధరావత్తు కట్టని టెండర్లు స్వీకరించబడవు. మిగిలిన వివరములకై కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవలెను.

వ.నెం.	వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1	పబ్లిక్ హెల్త్ సామాగ్రి	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
2	స్టేషనరీ	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
3	బుక్స్ & ఫారమ్స్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
4	వీధి లైట్లు రిపేరియర్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
5	ఆర్.డబ్ల్యూ.యస్. పైపు లైను విడిభాగములు	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-

గమనిక: పంచాయితీ సాధారణ నిధుల నిల్వలను బట్టి ప్రాధాన్యత క్రమములో చెల్లింపులు జరుపబడును.

సం/- **గెడ్డం రాజ్యలక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, మలికిపురం

సం/- **ఐ.సుభాకరబాబు,** పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయితీ, మలికిపురం

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఇంద్రపాలెం

రి.క.నెం. 20/2024-25 తేది:18-03-2025

టెండరు నోటీసు

కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం గ్రామపంచాయితీకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరములో గ్రామపంచాయితీ నిధులతో ఈ దిగువ తెలిపిన విధంగా అవసరమైన కాంట్రాక్టు పద్ధతిపై పారిశుద్య కార్మికుల సేవలు చేయుటకు, మరియు రక్షిత మంచినీరు, పారిశుద్ధ్య పనిముట్లు, పబ్లిక్ హెల్త్ కలరా మందులు, స్టేషనరీ అండ్ బుక్స్ & ఫారమ్స్ మరియు ఎలక్ట్రికల్ విడి భాగములు వగైరా సప్లయి కొరకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డు టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది.27-03-2025 గురువారము మధ్యాహ్నం 12:00 గంటల వరకు తీసుకొనబడి, అదే రోజు మధ్యాహ్నం 02:00 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లు దాఖలా చేయుటకు చెల్లించవలసిన ధరావత్తు పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఇంద్రపాలెం వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డిలు /MR ద్వారా గాని చెల్లించి, చెల్లించిన రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది.26-03-2025వ తేది సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యుళ్ళు రేటు, టెండరు షరతులు, ఇతర వివరములు ఈ కార్యాలయం పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవలెను. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి బిల్లులు చెల్లించబడును మరియు ఎట్టికారణము చూపకుండానే టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దుపరుచుటకు గాని పంచాయితీ కార్యదర్శివారికి పూర్తి అధికారము గలదు.

వ.నెం.	టెండరు కాల పరిమితి	వివరములు	చెల్లించవలసిన టెండరు ధరావత్తు (మనిషి ఒక్కింటికి)
1.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు శానిటరీ మేస్త్రి సేవలు -2	100/-
2.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు PWS ఆపరేటర్ సేవలు -1	100/-
3.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు లైబ్రరియన్ సేవలు -1	100/-
4.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు -1	100/-
5.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బిల్ కలెక్టర్ సేవలు -2	100/-
6.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు డ్రైన్ క్లీనర్ సేవలు -3	100/-
7.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు పారిశుధ్య పని స్వీపర్ల సేవలు -26	100/-
8.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ఎద్దు సప్లై దారు సేవలు -1	100/-
9.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కార్టు డ్రైవర్ సేవలు -1	100/-
10.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ట్రాక్టర్ డ్రైవర్ సేవలు -2	100/-
11.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బరియల్ గ్రౌండ్ వాచ్‌మెన్ సేవలు -1	100/-
12.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లై	500/-
13.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పారిశుధ్య పనిముట్ల సప్లై	500/-
14.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పబ్లిక్ హెల్త్ కలరా మందులు (బ్లీచింగ్, ముగ్గు, పినాయిల్, దోమల మందులు వగైరా)	500/-
15.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	స్టేషనరీ, బుక్స్ అండ్ ఫారములు సప్లై కొరకు	500/-
16.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	ఎలక్ట్రికల్ సామానులు, LED లైట్లు విడి భాగములు, LED లైట్లు ఫిట్టింగులు సప్లై	500/-

పైన పట్టిక నందు తెలిపిన సేవలకు మరియు వివిధ సామానుల సప్లై కొరకు టెండర్లు కోరడమైనది.

పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం

సం/- **ప్రత్యేక అధికారి**
గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం